


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

1

(జులై 7, 1972, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

ఏ సంసారంలో చూచినా, ఏదో ఒక సమస్య, ఏ వ్యక్తిని పలకరించినా ఏదో ఒక వేదన, ఏ యువకుణ్ణి చూచినా ఏదో ఒక సరిక్రొత్త సాధన.. ఏ ప్రసంగం విన్నా ఏదో ఒక అర్థంకాని బోధన!

ఈ ప్రపంచంలో హాయిగా బ్రతుకుతున్నట్లు నటించడమేగాని, అలాటి అదృష్టం నిజంగా ఉన్న వాళ్ళు చాలా తక్కువ మంది.

"అంతా కులాసా?" అని ప్రశ్నిస్తే

"ఏం కులాసా లెండి! అలాగే కుంటుకుంటూ పోతున్నా ముందుకు" అని జవాబు చెప్పేవారే ఎక్కువమంది కనిపిస్తారు. వారి గొడవలే ఎక్కువగా వినిపిస్తాయి!...

అయితే కొరతలు కొన్ని జీవితాలలో ఉన్నా "కొందరు కోరరాని కోరికలు కోరి" తీరని ఆవేదన చెందుతూ ఉండటం కూడా కద్దు. ఇదో రకం ప్రారబ్ధం.

ఎంత సంపాదన ఉన్నా - సంతృప్తి లేక పోవడం వల్ల చాలామంది బాధపడుతూ ఉంటారు. ఏదో భగవంతుడు అన్నం ఇళ్ళూ ఇచ్చాడు. ఎలాగో అలా తిని పరుంటే సరిపోతుందనుకోకపోవడం... లేనిపోనిదాన్ని ఒకటి తలుచుకుని తలబాదుకోవడం ఇలాటి కళలో ఒకటి అయింది.

*గ్యాస్ పొయ్యి మీద అంతులేని విరహం!*

కుంపట్లో పండునిప్పులమీద కూరలు వగైరాలు చక్కగా ఉడుకుతాయి, తినడానికి ఎంతో రుచిగా కూడా ఉంటాయి. కాని అలా వండుకుని తినే మనఃశ్శాంతి ఎక్కడిది? మధ్య మధ్య గ్యాస్ పొయ్యి మీద విరహం, చేస్తున్న పనిమీద నిర్లక్ష్యం, కొనలేదని అప్పట్లో పడి కొట్టుకు చచ్చే భర్త మీద నింద.. ఇలా నీళ్ళు కారిపోతూ ఉంటారు కొందరు ఇల్లాళ్ళు.

ఇలా ఎన్నెన్ని కారణాలతోనో ప్రజలు జీవితంలో గల సరదా పోగొట్టుకుంటున్నారు. సరదా కూడా చాలా ఖరీదు గల వస్తువైపోయింది. మొన్న ఒక యువకుడు కనిపించాడు. బజారులో భార్య కూడా వెంట ఉంది. ఆయన పలకరించాడు

"సినిమాకా?" అన్నాను.

ఆయన తేరిపార చూచి "అలా అన్నారేం?" అన్నాడు.

"ఏదో సరదాకు వెడుతున్నారేమోనని అన్నాను!"

"అంత సరదా ఎక్కడుంది జీవితాలలో? సినిమా అయిదు రూపాయలు వదిలిస్తుంది. ఇంట్లో చింతపండులేదు. మిరపకాయలు లేవు. కాఫీ పొడుం అయిపోయింది. సరదాగా సినిమా చూచి, ఇంటికి వెళ్ళి పడుకుంటే - తెల్లారి ఏ అమ్మ బదులిస్తుంది?... ఈ రోజుల్లో వాకిట్లోకి వెడితే పొమ్మనే వారేగాని - రమ్మనేవారు లేరు" అని అతగాడు ఎంతో దైన్యంగా తన స్థితిగతుల్ని వర్ణించాడు.

నిజమే. ఈ రోజుల్లో సరదాలు నశించి పోయాయి. భార్యాభర్తలు కానివ్వండి, తండ్రీ బిడ్డలు కానివ్వండి. తల్లీపిల్లలు కానివ్వండి ఒక్క అరగంట నవ్వుతూ సరదాగా కాలక్షేపం చేసే అవకాశాలు కల్పించుకోలేకుండా ఉన్నారు. అంతగా కావాలంటే డబ్బుతో సంపాదించుకోవలసి వస్తోంది.

*పొరుగూరు నుంచి వచ్చిన పున్నయ్యలాగా..*

పుట్టెడు బాధలతో ఇంటికి చేరిన పురుషుడు - రెండు మెతులులు తిని దిండు మీద తలవాల్చడం తప్ప ఏం ఆలోచించగలడు? భార్యతో సరదాగా ఏం మాట్లాడగలడు? నవ్వుల సంతర్పణ లేం చెయ్యగలడు? పొరుగూరు నుంచి వచ్చిన పున్నయ్యలాగా పడుకుని నిద్రపోవడం తప్ప!

నలుగురు పిల్లలున్న ఇంట్లో నారీమణులు మాత్రం ఏం కులాసాగా ఉంటున్నారు - వాళ్ళ పోట్లాటలు, గొడవలు, కొట్టుకోవడాలు, ఇంట్లో వస్తువులు పాడు చెయ్యడాలు... అన్నిటినీ మించి చెవులు బద్దలయేటట్లు మోత మోగుటాలు, ఇవన్నీ భరిస్తూ ఆ ఇల్లాలు పనులు చేసుకోవాలంటే ఎంత అవస్థ!

ఈ అవస్థలో నుంచి తప్పించుకుని బయటపడటమే చాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటుంటే - ఇంకా సరదాలెక్కడ? సరసమెక్కడ? "ఈ రోజు గడిచింది ప్రభూ!.." అనుకుంటూ వంటిల్లు తాళం పెట్టడంలో ఎంతో శాంతి పొందే పరిస్థితులేర్పడ్డాయి.

*సరదాలు లేని సంసారాలు... వరదలో చెట్లు!*

సరదాలు లేని సంసారాలు వరదలో పడికొట్టుకుపోయే చెట్లలాంటివి. సరదాలు లేనిదే సహనమే కాదు, సరిఅయిన ఆలోచనే రాదు. "సర్వం దైవాధీనం" అన్నట్లు పడి ఉండవలసిందే!...

ఆ భగవంతుడు మాత్రం ఎంత పని ఉన్నా సరదాలు మానుకున్నాడా! అబ్బో! అంతులేని సరదాలు. చుట్టూ నవ్వుల పరదాలు. అత్యవసరమైన పనులు కూడా మాని సరదాలు ఎప్పుడో కరీంద్రుని విషయంలో ఒక్కమాటు సరదాలు వదిలి వచ్చాడు గాని - తక్కిన సమయాలలో వాటికే ప్రాధాన్యం.

నారదముని ఒకసారి వైకుంఠానికి వెడితే ఆయనగారు లక్ష్మితో ఆటలాడుతున్నాడుట. "ఇదేమిటి స్వామీ!" అని ఆ బ్రహ్మచారి ఆశ్చర్యంగా అడిగాడుట.

ఆ అరవిందాక్షుడు చిరునవ్వు నవ్వి "ఏదో తోచక పాచికలు!" అన్నాడుట!

✡ ✡✡

Comment on this article..